క్లుప్తంగా

ఏయూ విభాగాల్లో వీసీ తనిఖీలు



విభాగంలో పరిశీలిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం సైన్స్ కళాశాల పరిధిలో గల అడ్వాన్స్ సైన్సెస్ భవన్‌లోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ న్యూట్రీషన్ విభాగాలను సందర్శించి ప్రయోగశాలలు, వసతులను పరిశీలించారు. విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మితో సమావేశమయ్యారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విభాగాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని వీసీ చెప్పారు.

విద్యుత్ స్తంభాల సముదాయం తొలగింపు



టీటీడీ కూడలిలోని ఇనుప విద్యుత్ స్తంభాల సముదాయాన్ని క్రేన్‌తో తొలగిస్తున్న సిబ్బంది

ఎంవీపీకాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపాన్ని ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాల సముదాయాన్ని బుధవారం భారీ క్రైన్ సాయంతో ఆ శాఖ ఉద్యోగులు పూర్తి స్థాయిలో తొలగించారు. ఎంవీపీ కాలనీలో భూగర్భ విద్యుత్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కొంతకాలంగా ఇక్కడి ఐరన్ విద్యుత్ స్తంభాల సముదాయం నిరుపయోగంగా ఉంది. ఇది శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు, స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్తంభాలను తొలగించినట్లు స్థానిక ఏఈ తెలిపారు. వినియోగదారులకు ఎలాంటి సమస్య ఉన్న ఎంవీపీ కాలనీ సెక్టార్-7లోని కార్యాలయం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సినీ దర్శకుడు ఆదిత్యతో ఇష్టాగోష్టి నేడు

భీమునిపట్నం: కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో చిత్ర దర్శకుడు పి.సి.ఆదిత్యతో గురువారం ఇష్టాగోష్టి నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పి. రాజేంద్రప్రసాద్ వర్మ, ఎ.సన్యాసిరాజు తెలిపారు. భీమిలి చిన్నబజారు శ్రీనివాస ఫంక్షన్ హాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో ఆదిత్య తీయనున్న చలన చిత్రంలో స్థానికులకు అవకాశం కల్పించనున్నారని, నటనపై ఆసక్తి గలవారు ఆయన్ను కలిసి వివరాలు అందించవచ్చని తెలియజేశారు.

బీచ్ రోడ్డులో సినిమా షూటింగ్



లొకేషన్‌లో హీరో నాగశౌర్య

కొమ్మాది: బీచ్ రోడ్డులో హీరో నాగశౌర్య నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ జరిగింది. ఉప్పాడ, ఎంవీపీ కాలనీల్లో బుధవారం షూటింగ్ నిర్వహించినట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. నాగశౌర్యపై ఇప్పటికే సింహాచలం, భీమిలి, ఆర్‌కే బీచ్ ప్రాంతాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించినట్లు చెప్పారు. భీమిలి-విశాఖ పరిసర ప్రాంతాల్లో మరో నాలుగు రోజుల పాటు ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందన్నారు.



సీఎంఆర్ సెంట్రల్ వద్ద గ్రీన్‌బెల్ట్ పార్కులో అంధకారం



గ్రీన్‌బెల్ట్ పార్కు గేటు వద్ద ప్రైవేట్ వాహనాల పార్కింగ్

కళావిహీనం..!

- అధ్వానంగా గ్రీన్‌బెల్ట్ పార్కులు
- రక్షణ కరవు.. పచ్చదనం కనుమరుగు
- నిర్వహణ గాలికొదిలేసిన అధికారులు
- పునరుద్ధరించాలని స్థానికుల విజ్ఞప్తి



పిచ్చిమొక్కలతో నిండిన గ్రీన్‌బెల్ట్ పార్కు



పిఠాపురం కాలనీ గ్రీన్‌బెల్ట్ పార్కులో కనుమరుగైన పచ్చదనం, అధ్వానంగా వాకింగ్ ట్రాక్

మద్దిలపాలెం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి.. ఆహ్లాదానికి ఎంతో ప్రాధాన్యమిచ్చింది. ప్రజలు కాసేపు సేదతీరేలా, ఆరోగ్యానికి వ్యాయామం చేసేలా నియోజకవర్గంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌లు, చిల్డ్రన్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్‌లతో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని సుందరమైన పార్కులుగా మలిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో గ్రీన్‌బెల్ట్ పార్కులు కళావిహీనంగా తయారయ్యాయి. వాటిలో పచ్చదనం కనుమరుగైంది. రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, గేట్లు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల అభివద్ధి పనులు సగంలోనే నిలిచిపోయాయి. అధ్వానంగా తయారైన ఈ పార్కులను చూసి స్థానికులు, సందర్శకులు నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు.

నిర్వహణ లేక అస్తవ్యస్తం

జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డుకు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో 300 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్, దానికి ఇరువైపులా, మధ్యలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించారు. పార్కుకు రక్షణగా చుట్టూ ఐరన్ ఫెన్సింగ్, ఒకవైపు గేటు ఏర్పాటు చేసి స్థానికులకు నిర్వహణ బాధ్యత అప్పగించారు. నిర్వహణ కరువై ఈ పార్కు కాస్తా అస్తవ్యస్తంగా మారింది.

కూటమి ప్రభుత్వంలో పార్కు నిర్వహణ సరిగా లేక అక్కడ వేసిన మొక్కలు మాయమయ్యాయి. పచ్చదనం హరించుకుపోయి కళతప్పింది. ఫెన్సింగ్ కొంత భాగం ధ్వంసమైంది. పార్కులోని ప్రవేశ ద్వారంగా ఏర్పాటు చేసిన ఐరన్ గేటు ఊడిపోయింది.

అంధకారం.. ఆకతాయిల అడ్డా

మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ వెనుక లక్షల రూపాయలు ఖర్చుపెట్టి అభివృద్ధి చేసిన గ్రీన్‌బెల్ట్ పార్కులో విద్యుత్ దీపాలు ఏర్పాటు మరిచారు. దీంతో చీకటి పడితే ఈ పార్కు ఆకతాయిలకు అడ్డాగా మారింది. మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లు ఇక్కడ హల్‌చల్ చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కులో లైట్లు లేక రాత్రి 8 గంటల దాటాక మందుబాబులతో ఇబ్బంది పడుతున్నట్టు చెబుతున్నారు. వీరివల్ల మహిళలు, ఆడపిల్లలు అటుగా వెళ్లడానికి, ఇంటి బయట కూర్చోడానికి భయపడుతున్నారు.

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి

సత్యం సెంటర్, సీఎంఆర్ సెంట్రల్ వద్ద గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో విద్యుత్ దీపాలు లేక రాత్రయితే ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలి. పార్కు ఫెన్సింగ్, గేటు ధ్వంసమయ్యాయి. అధికారులు స్పందించి వాటిని పునరుద్ధరించాలి.

– జయశ్రీ, మద్దిలపాలెం

పచ్చదనం పెంపొందించాలి

గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో గతంలో నాటిన మొక్కలు మాయమయ్యాయి. పిఠాపురం కాలనీ గ్రీన్‌బెల్ట్ పార్కులో పచ్చదనం కరువైంది. వాకింగ్ ట్రాక్ చుట్టూ, మధ్యలో ఆకర్షణీయమైన మొక్కలు నాటి ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చేలా పార్కును తీర్చిదిద్దాలి.

– కె.వర్మ, పిఠాపురం కాలనీ

రహదారులపై నిలిచిన వర్షపు నీరు



వెటర్నరీ కాలనీలో ఇళ్ల ముందు కాలువలను శ్లాబ్‌తో మూసివేయడంతో రోడ్డుపై చేరిన నీరు



విశాలాక్షినగర్ కో ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు (బీచ్ రోడ్డుకు సమీపంలో)

- విశాలాక్షినగర్‌లో మూతపడిన కాలువలు
- నీరు పారే దారి లేక.. ఈ పరిస్థితి

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో కాలువల్లో ప్రవహించాల్సిన వర్షపు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఇక్కడ వెటర్నరీ కాలనీ, కో ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డుతోపాటు పలు కాలనీల్లో కాలువలు మూసుకుపోయాయి. మట్టి, దానిపై పిచ్చిమొక్కలతో కాలువలు మూతపడ్డాయి. ఇటీవల కొత్తగా నిర్మాణాలు జరిగిన వెటర్నరీ కాలనీలో ప్రధాన రహదారికి ఇరుపక్కలా ఉన్న కాలువలపై పెద్ద సిమెంట్ శ్లాబ్‌లు వేసి మూసేశారు. దీంతో కాలువల్లో పేరుకుపోయిన పూడికను పారిశుధ్య కార్మికులు తొలగించడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా పారిశుధ్య సిబ్బంది అన్ని కాలనీల్లో కూడా కాలువల్లో పూడికను తొలగించకుండా వదిలేశారు. పూడిక, పిచ్చిమొక్కలతో కాలువలు నిండిపోవడం, వాటిపై శ్లాబులు వేయడంతో స్థానికుల వాడుక నీటితోపాటు వాన నీరు కూడా కిందకు ప్రవహించే మార్గాలు మూసుకుపోయాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఆ నీరు రోడ్లపైనే పారుతోంది. గోతుల్లో నిల్వ ఉండిపోయి బురదగా మారుతోంది. స్థానికులుతోపాటు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. బుధవారం ఉదయం కురిసిన చిన్నిపాటి వర్షానికి ఇక్కడ కాలువల ద్వారా ప్రవహించాల్సిన నీరు రోడ్లపై పల్లంగా ఉన్న పలు చోట్ల నిలిచిపోయింది. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తొలగించే చర్యలు తక్షణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జూనియర్ కాలేజీకి స్థలం కేటాయించాలని ఫ్లెక్సీ ప్రత్యక్షం



తోటగరువు హైస్కూల్ పక్కన పి.వి.సింధుకు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆరిలోవ: తోటగరువులో జూనియర్ కళాశాల కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని స్థానిక ప్రజా సంఘాలు కోరుతున్నట్లు ఓ ఫ్లెక్సీ ప్రత్యక్షమైంది. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు 2016 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె విశాఖలో షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేయడానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కన బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకుని రెండెకరాల స్థలాన్ని కేటాయించింది. అప్పట్లోనే చినగదిలి రెవెన్యూ అధికారులు సర్వే చేయించి, చదును చేసి పి.వి.సింధుకు స్థలం అప్పగించారు. ఇది కేటాయించి సుమారు ఆరేళ్లకు పైగా దాటింది. వారం కిందట మళ్లీ ఆ స్థలాన్ని రెవెన్యూ అధికారులు చదును చేసి.. 'ఈ స్థలం పి.వి.సింధు బ్యాడ్మింటన్ అకాడమీ కోసం ప్రభుత్వంచే కేటాయించబడినది. ఆక్రమణదారులు శిక్షార్హులు' అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అదే స్థలాన్ని జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కేటాయించాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య వేదిక పేరుతో హెచ్చరిక బోర్డుకు సమీపంలో రోడ్డు పక్కన ఓ చెట్టుకు ఫ్లెక్సీ కట్టారు. దీంతో ప్రజా సంఘాలపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. పి.వి.సింధు బ్యాడ్మింటన్ అకాడమీ కోసం సుమారు ఆరేళ్లకు పైగా కేటాయించిన స్థలాన్ని ఇప్పుడు కావాలని కోరడంపై ఆక్షేపిస్తున్నారు. ఇంతవరకు ఈ సంఘాల ప్రతినిధులు ఎందుకు కోరలేదని ప్రశ్నిస్తున్నారు. ప్రారంభంలోనే కోరి ఉంటే ఈపాటికే కాలేజీ కోసం స్థలం సాధించి ఉండేవారని అంటున్నారు. దీనికి సమీపంలో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలం ఉందని, దానిని కళాశాల కోసం కేటాయించాలని ప్రజా సంఘాల పోరాడితే కార్యరూపం దాల్చే అవకాశముంటుందని స్థానికులు భావిస్తున్నారు. తద్వారా ఈ ప్రాంతంలో క్రీడా సంస్థతోపాటు కళాశాల కూడా అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమ

ఎంవీపీకాలనీ: స్థానిక సమత డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం లైంగిక వేధింపులు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంటర్ ప్రీమియర్ హెచ్‌ఆర్ కన్సల్టెంట్ డాక్టర్ హేమ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రతి కళాశాల, సంస్థల్లో ప్రత్యేక వ్యవస్థలు ఉండాలని సూచించారు. ఆయా సంస్థలు అంతర్గతంగా ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించడంతోపాటు వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. ఫిర్యాదుదారు స్వేచ్ఛగా తన సమస్యను తెలియజేసే వాతావరణం కల్పించాలని సూచించారు. లైంగిక వేధింపుల విషయంలో విద్యార్థినులు, మహిళలు కుంగిపోకుండా ధైర్యంగా వారి సమస్యను ప్రత్యేక వ్యవస్థ ముందుంచాలన్నారు. తద్వారా లైగింక వేధింపులకు అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. లైంగిక వేధింపులకు రాజ్యాంగం అందుబాటులోకి తెచ్చిన చట్టాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు పైనాపిల్ కాలనీ, సీఐడీ కార్యాలయం, కామాక్షినగర్, జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్, పాండురంగాపురం, శివాజీనగర్, ప్రగతినగర్, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకాంత్‌నగర్, కనకమహాలక్ష్మినగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌నగర్, ఆరిలోవ పోలీస్ స్టేషన్ ప్రాంతం, దుర్గానగర్, నెహ్రూనగర్, టి.ఐ.సి.పాయింట్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

ధరలు తగ్గించాలని ధర్నా



ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: సామాన్యులపై ఆర్థిక భారం పడుతున్న నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జోన్ ఆరిలోవ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ కూడలి నుంచి పాత ఆరిలోవ మీదుగా బాలాజీనగర్ వరకు ర్యాలీ చేశారు. పెరిగిన ధరలు అదుపు చేయాలని, పెరిగిన ధరలకు హద్దే లేదా అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెంచి వారిపై మోయలేని ఆర్థిక భారం వేస్తోందని మండిపడ్డారు. ప్రజలు నిత్యావసర సరకులు కొనలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం కాలం గడుపుతోందని విమర్శించారు. ఉచిత ఇసుక ఇవ్వడం లేదు సరికదా.. ఎన్నడూలేని ధరలకు ఇసుక అమ్ముకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసుబాబు, పుష్పలత, చిరంజీవి, రవి, నూకరాజు, సత్తిబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మారథాన్‌లో విశాఖవాసుల ఘనత



చికాగో మారథాన్‌లో సత్తా చాటిన వైజాగ్ రన్నర్స్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్

బీచ్‌రోడ్డు: అమెరికాలోని చికాగో నగరంలో ఇటీవల నిర్వహించిన బ్యాంక్ ఆఫ్ అమెరికా చికాగో మారథాన్‌లో వైజాగ్ రన్నర్స్ సొసైటీ సభ్యులు సత్తా చాటారు. ఈ పోటీలో ప్రపంచ దేశాల నుంచి వేలాది మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ సెక్రటరీ కె.శ్రీనివాస్, అరవింద్, ప్రియ మాధుర్, రాజేంద్ర పాల్గొని నిర్ణీత సమయం కన్నా ముందే గమ్యాన్ని చేరుకొని ఘనత సాధించారు. విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన వీరిని సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్, ఇతర సభ్యులు అభినందించారు. సహచర సభ్యుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ట్రైనింగ్ సెషన్లు నిర్వహిస్తోందని, నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సభ్యులు కోరారు.

కుటుంబ కథా చిత్రం 'ఎంత పనిచేశావ్ చంటి..!'



మీడియా సమావేశంలో పాల్గొన్న చిత్ర యూనిట్

బీచ్‌రోడ్డు: 'ఎంత పనిచేశావ్ చంటి..!' మంచి కుటుంబ కథా చిత్రమని ఆ సినిమా హీరో శ్రీనివాస్ తెలిపారు. మూవీ ప్రమోషన్‌లో భాగంగా బుధవారం నగరానికి వచ్చిన చిత్ర యూనిట్ ఒక హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ సినిమా షూటింగ్ మొత్తం విశాఖలోనే జరిగిందన్నారు. కుటుంబంలో చోటుచేసుకుంటున్న సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు చెప్పారు. ఈ నెల 19న నరసదాపురంలో ఆడియో ఫంక్షన్, 22న విశాఖలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హీరోయిన్ నిహారిక, డైరెక్టర్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల పాటు కేరళ ఆయిర్వేద శిబిరం



డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్

డాబాగార్డెన్స్: ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ నాలుగు రోజుల పాటు విశాఖలో అందుబాటులో ఉంటారని వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో రామ్‌నగర్‌లోని జీవీఎంసీ ఔట్ గేట్ ఎదురుగా గల వైద్యరాజ ఔషధాలయంలో, 22, 23 తేదీల్లో మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపంలోని వైద్యరాజ్ కేంద్రంలోనూ ఆయన ఆయిర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందజేస్తారని చెప్పారు. చర్మవ్యాధులు, ఆర్థరైటీస్, సైనసైటిస్, సొరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్, కీళ్ల వ్యాధులు, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ చికిత్స చేస్తారన్నారు. వివరాలకు 80080 00670, 76758 61446 నంబర్లలో డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు.

చినుకు పడితే చెరువే..!



కేఆర్ఎం కాలనీ శివాలయం వీధిలోని ఇళ్లల్లోకి కొట్టుకొచ్చిన వ్యర్థాలు



వర్షపు నీటితో నిండిన శివాలయం వీధి

- నీట మునుగుతున్న కేఆర్ఎం కాలనీ
- ఇళ్లలోకి చేరుతున్న మురుగు, వ్యర్థాలు

మద్దిలపాలెం: వానొస్తే చాలు.. జీవీఎంసీ 16వ వార్డులోని కేఆర్ఎం కాలనీ నీటమునుగుతోంది. వర్షపు నీటితో వీధులు, రహదారులన్నీ నిండి చెరువును తలపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఎప్పుడు చినుకు పడినా ఇదే సమస్య. దసరా పండగ పేరుతో పారిశుధ్య సిబ్బంది వారం రోజులుగా కాలువల్లోని పూడికలు తీయడం మానేశారు. దీంతో బుధవారం కురిసిన వర్షానికి కేఆర్ఎం కాలనీలోని శివాలయం వీధి నీటమునిగింది. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కాలువలు మూతపడటంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. దీంతో లోతట్టు ప్రాంతంలో గల ఇళ్లలోకి మురుగు నీరు వివిధ రకాల వ్యర్థాలతో కలిసి ప్రవహించింది. దుర్వాసనతోపాటు వ్యాధులు ప్రబలుతాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఒకటైన కేఆర్ఎం కాలనీ మోకాల లోతు నీటితో నిండిపోయింది. ఇళ్లలోకి వాన నీరు భారీగా చేరింది. కాలనీలో రాకపోకలు సాగించడానికి వీలు లేనంతగా వర్షపు నీరు ప్రవహించింది. పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాలు కొన్ని వర్షపు నీటి హోరుకు పడిపోయాయి. గంట పాటు కురిసిన భారీ వర్షంతో కాలనీ ఇలా మునిగిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరికాసేపు కురిస్తే పరిస్థితి మరోలా ఉండేదని అంటున్నారు. కొన్ని నెలలుగా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

కేఆర్ఎం కాలనీలోని లోతట్టు ప్రాంతాలను గుర్తించాలి. అక్కడ వర్షపు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలి. కాలనీల్లో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించాలి. ముంపు భయం లేకుండా చర్యలు చేపట్టాలి. చిన్నపాటి వర్షానికే కాలనీలోని కాలువల్లో గల వ్యర్థాలు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దుస్థితి నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



పల్లా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖ జిల్లా కమిటీ కార్యదర్శి పిళ్లా శంకరరావు తెలిపారు. బుధవారం ఆయనను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశామన్నారు. రెండేళ్లుగా విశాఖ జిల్లా ఆర్టీసీ డీపీటీవో ఎ.అప్పలరాజు ఉద్యోగులపై చేస్తున్న కక్ష్యసాధింపు చర్యల గురించి వివరించి, దాదాపు 500 పేజీల బుక్‌లెట్‌ను అందించామని చెప్పారు. డీపీటీవో వైఖరితో విసిగి ఇబ్బందులకు గురవుతున్న జిల్లా ఉద్యోగుల సంతకాలు సేకరించి కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. పల్లా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.రామారావు, డివిజన్ అధ్యక్షుడు వి.ఎస్.ఆర్.మూర్తి, డిపో ముఖ్య సలహాదారు సంజీవి, డిపో కమిటీ నాయకులు టి.ఎస్.ఎస్.రావు, జి.ఎన్.మూర్తి, ముఖ్య కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.